## క్లుప్తంగా

### రంజాన్ తోఫా పంపిణీ

కర్నూలు(రాజ్‌విహార్): రంజాన్ మాసం సందర్భంగా కర్నూలు ప్రగతి సమితి ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులు అందజేశారు. గురువారం స్థానిక అశోక్ నగర్‌లోని మోడ్రన్ కాంప్లెక్స్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు ఎం.శ్రీహర్ష మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక కర్నూలు అని, పేదలు సైతం పండుగ చేసుకోవాలన్న లక్ష్యంతో తమ సంస్థ ఆధ్వర్యంలో కానుకలు అందజేసినట్లు వెల్లడించారు.ఆ సంఘం ప్రతినిధులు శ్రీనివాస్, హరినాథ్ గౌడ్, చాంద్ పాల్గొన్నారు.

### ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే



ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ పట్టాలతో చిన్నారులు

కర్నూలు సిటీ: వెంకటరమణ కాలనీలోని నారాయణ స్కూల్ ఈ-కిడ్స్ విభాగంలోని విద్యార్థులకు గురువారం ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహించారు. ప్రముఖ దంత వైద్యులు యశ్వంత్, ఏజీఎం రమేష్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు బాల్యం నుంచే క్రమశిక్షణ అలవాటు చేయాలన్నారు. స్కూల్ జోనల్ కో-ఆర్డినేటర్ అరుణ, ప్రిన్సిపాల్ దినేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రజియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

### ఒలంపియాడ్‌లో విజయభేరి



సత్తాచాటిన విద్యార్థులతో స్కూల్ సిబ్బంది

కర్నూలు సిటీ: జాతీయ స్థాయిలో ఇటీవల జరిగిన ఇన్‌స్టా ఒలంపియాడ్ పరీక్ష ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు విజయభేరి మోగించినట్లు ఆ స్కూళ్ల ఏజీఎం సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక భాస్కర్‌నగర్‌లోని బ్రాంచ్‌లో ఇన్‌స్టా ఒలంపియాడ్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థుల అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఒలంపియాడ్‌లో జాతీయస్థాయిలో లెవెల్-1కు 23 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, కర్నూలు జోన్ నుంచి ముగ్గురు ల్యాప్‌టాప్‌లు, 20 మంది ట్యాబ్‌లు గెలుపొందారన్నారు. 125 మంది విద్యార్థులు టాప్-5లో ర్యాంకులు సాధించారని, 2251 మంది మెడల్స్ పొందారని వివరించారు. సిబ్బంది నాగేశ్వరరావు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

### బ్యారేజీతోనే రాయలసీమ సుభిక్షం



మాట్లాడుతున్న రాయలసీమ స్టీరింగ్ కమిటీ కన్వీనర్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

కర్నూలు కల్చరల్: సిద్ధేశ్వరం-సోమశిల ప్రాజెక్టు వద్ద ఐకానిక్ బ్రిడ్జికి బదులుగా బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24వ తేదీన రాయలసీమ మేధావుల స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపడుతున్నట్లు కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి వెల్లడించారు. గురువారం నగరంలోని ఆయన కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సిద్ధేశ్వరం వద్ద బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మిస్తే రాయలసీకు నీటి సమస్య తీరడంతో పాటు సుభిక్షంగా ఉంటుందన్నారు. అప్పర్ భద్ర నిర్మాణంతో రాయలసీమ జిల్లాలు పూర్తిగా నష్టపోతాయన్నారు. రాయలసీమ సమస్యల సాధన, బ్యారేజీ నిర్మాణం డిమాండ్‌తో ఈనెల 24న ఎస్టీబీసీ కళాశాల మైదానంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాయలసీమ కర్తవ్య దీక్ష చేపట్టనున్నట్లు వెల్లడించారు. అలాగే మే నెలలో సంతకాల సేకరణ, జూన్‌లో చలో ఢిల్లీ చేపడతామని స్పష్టం చేశారు. విద్యావేత్త కేవీ సుబ్బారెడ్డి, స్టీరింగ్ కమిటీ సభ్యులు,వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### నోటీసులు వెనక్కి తీసుకోవాలి

కర్నూలు సిటీ: పదవ తరగతి మూల్యాంకనానికి అనారోగ్య కారణాల వల్ల రాలేకపోయిన టీచర్లకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను వెనక్కి తీసుకోవాలని ఎస్టీయూ నాయకులు గురువారం డీఈఓను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కె జనార్దన్ మాట్లాడుతూ.. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం టీచర్లకు సెలవు ఇవ్వాలన్నారు. మొదటి రోజు సకాలంలో స్పాట్ కేంద్రానికి రాలేకపోయిన, అనారోగ్య కారణాల వల్ల గైర్హాజరైన వారికి ఇచ్చిన నోటీసులను రద్దు చేయాలని డీఈఓను కోరారు.

### సాక్షి సినిమాలు

**ఎస్వీసీ కాంప్లెక్స్ :** కిసీ కా భాయ్ కిసీ కా జాన్ విరుపాక్షి,దసరా,ఇవిల్‌డెడ్ రైజ్,శాకుంతలం రావణాసుర
**వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ :** కిసీ కా భాయ్ కిసీ కా జాన్, విరుపాక్షి ఇవిల్‌డెడ్ రైజ్,విడుదల పార్ట్-1,దసరా
**వెంకటేష్ సినీ కాంప్లెక్స్ :** విరుపాక్షి విడుదల పార్ట్-1,రుద్రుడు
**ఐనాక్స్:** కిసీ కా భాయ్ కిసీ కా జాన్ ఇవిల్‌డెడ్ రైజ్,సుజుమె, విడుదల పార్ట్-1 ది సూపర్ మారియో బ్రదర్స్,హలో మీరా రావణాసుర
**భరత్ కాంప్లెక్స్ :**కిసీ కా భాయ్ కిసీ కా జాన్
**శ్రీరామ :** విరుపాక్షి
**రాజ్ :** విరుపాక్షి , **విజయ :**విరుపాక్షి

---

- స్టాండింగ్ కమిటీ సమావేశంలో 12 అంశాలకు ఆమోదం
- రూ.3.22 కోట్ల అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్

# నగరాభివృద్ధే అజెండా



మున్సిపల్ కార్యాలయంలో మేయర్ స్టాండింగ్ కమిటీ సమావేశం

కర్నూలు (టౌన్): కర్నూలు నగర పాలక పరిధిలో అభివృద్ధే అజెండాగా పనిచేస్తున్నట్లు నగర మేయర్ బీవై రామయ్య స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం స్థానిక నగరపాలకలోని మేయర్ చాంబర్‌లో బీవై రామయ్య అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కమిషనర్ భార్గవ్‌తేజతో పాటు స్టాండింగ్ కమిటీ సభ్యులు పుల్లమ్మ, వైజా అరుణ, మల్లికాబేగం, రాజేశ్వరరెడ్డి, సాన శ్రీనివాసులు పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ.. నగరపాలక సంస్థను ఆర్థికంగా పటిష్టం చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే వార్డుల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సమావేశంలో మొత్తం 12 అంశాలపై చర్చించి రూ.3.22 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. డిప్యూటీ కమిషనర్ ఎస్వీ రమాదేవి, మున్సిపల్ ఈఈ శేషసాయి, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్ కుమార్, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, రెవెన్యూ అధికారి జునీద్ పాల్గొన్నారు.

**ఆమోదించిన అంశాలు**

- మునగాలపాడు పంపింగ్ స్టేషన్ వద్ద 15 ఎంఎల్‌డీ డబ్ల్యూటీపీ (వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) ఏర్పాటు చేసేందుకు రూ.49.90 లక్షలు కేటాయించారు.
- సంతోష్‌నగర్ వద్ద రూ.49.90 లక్షలతో పైపులైన్ నిర్మాణం
- మునగాలపాడు పంపింగ్ స్టేషన్ వద్ద రూ.30 లక్షలతో 15 ఎంఎల్‌డీ ఏర్పాటు
- అశోక్‌నగర్ హెడ్ వాటర్ వర్క్స్ వద్ద క్లోరినేటర్, సెన్సార్ ఏర్పాటుకు రూ.33.50 లక్షలు కేటాయింపు
- రిలయన్స్ మార్కెట్ నుంచి నాయుడు ఫంక్షన్ హాలు వరకు రూ.17 లక్షలతో కొత్తగా పైపులైన్ నిర్మాణం
- శివప్ప నగర్ ట్యాంకు నుంచి ఇండస్ట్రియల్ ఎస్టేట్ వరకు రూ.33 లక్షలతో పైపులైన్ నిర్మాణం
- బంజార కాలనీలో లోతట్టు రోడ్లను రూ.40 లక్షలు వెచ్చించి పునర్నిర్మించనున్నారు.
- 2వ కమ్యూనిటీ హాల్‌కు టాయ్‌లెట్లు, కిచెన్ షెడ్డు, ఫ్లోరింగ్, పెయింటింగ్, విద్యుత్ సరఫరా, మంచి నీటి సరఫరా వంటి పనులు చేపట్టేందుకు రూ.20 లక్షలు కేటాయించారు.



రాంప్రియ నగర్‌లో టెన్నిస్, క్రికెట్ అకాడమీ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కమిషనర్ భార్గవతేజ తదితరులు

# ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

కర్నూలు (టౌన్): అభివృద్ధిలో కర్నూలు నగరాన్ని అగ్రభాగంలో నిలుపుతున్నట్లు నగర మేయర్ బీవై. రామయ్య స్పష్టం చేశారు. గురువారం నగరపాలక సంస్థ పరిధిలోని 19వ వార్డు జొహరాపురం రోడ్డులో రాంప్రియనగర్‌లో రూ.80 లక్షలతో టెన్నిస్ కోర్టు, క్రికెట్ ప్రాక్టిస్ కోర్టు (స్పోర్ట్సు కాంప్లెక్స్) నిర్మాణాలకు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజతో కలిసి భూమిపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరపాలక సంస్థకు పాలకవర్గం ఏర్పడిన రెండేళ్లలోనే కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కళ్లు లేని కబోదిలా కర్నూలు నగరంలో అభివృద్ధి పనులు చేయడం లేదంటూ ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. పార్కులను అందంగా తీర్చిదిద్దడమే కాకుండా ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మురుగు కాల్వలు పూర్తి చేశామన్నారు. రూ.1.39 కోట్లు వెచ్చించి ఇండోర్ స్టేడియాలు, రూ.80 లక్షలతో టెన్నిస్ కోర్టు, క్రికెట్ ప్రాక్టిస్ కోర్టు, వాకింగ్ ట్రాక్ ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఏన్నడూ లేని విధంగా కర్నూలు నగరంలోని మూడు అర్బన్ ప్రాంతాల్లో రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ నగరంలో యువత, పిల్లలకు ఆహ్లాదం , క్రీడల్లో రాణించే విధంగా క్రీడా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే ఇండోర్ స్టేడియంతో పాటు సింథటిక్ టర్ఫ్ కోర్టు, జాగింగ్ కోసం నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, నారాయణ రెడ్డి, వైజా అరుణ, కె.పద్మాలతా రెడ్డి, రాజేశ్వరరెడ్డి, సాన శ్రీనివాసులు, బెల్లంకొండ మహేశ్వర రెడ్డి, గోపాల్ రెడ్డి, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ వేణుగోపాల్, ఈఈ శేషసాయి, డీఈఈ రవిప్రకాష్ నాయుడు, ఏఈ జనార్దన్ పాల్గొన్నారు.

# ఉపాధి పనులు కల్పించండి



హాజరైన వివిధ శాఖల అధికారులు, మాట్లాడుతున్న కలెక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు పనులు కల్పించి వలసలను నివారించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డ్వామా, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి పనులను వీలైనంత ఎక్కువగా నిర్వహించాలన్నారు. జిల్లా పడమటి ప్రాంతంలో వలస నివారణకు ఉపాధి పనులే ఏకైక మార్గమన్నారు. ప్రజలు ఉపాధి పనులకు వెళ్లేలా ప్రోత్సహించాలన్నారు. చేసిన పనులకు వెంటనే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డిని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావును ఆదేశించారు. అలాగే ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యంను ఆదేశించారు. అనంతరం ఆయా శాఖల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు.

### బిల్లుల వసూలుపై దృష్టి పెట్టండి

కర్నూలు(రాజ్‌విహార్): నెలవారీ విద్యుత్ బిల్లుల వసూలుపై దృష్టి పెట్టాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. గురువారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వంద శాతం బిల్లుల వసూలే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసుకొని డబ్బు రాబట్టాలన్నారు. పాత బకాయిలతో పాటు ప్రభుత్వ శాఖ బకాయిలూ వసూలయ్యేలా చూడాలని సూచించారు.

### 23న కవి సమ్మేళనం

కర్నూలు కల్చరల్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 23వ తేదీ సాయంత్రం 6 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఆజ్ కీ షామ్ ఖౌమీ ఏక్ జహతీ కే నామ్ పేరుతో ముషాయిరా కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. సెర్ప్ సీఈఓ ఐఏఎస్ ఏఎండీ ఇంతియాజ్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సాహితీ ప్రియులందరూ పాల్గొనవచ్చని విజ్ఞప్తి చేశారు.

### 24న జై భారత్ సత్యాగ్రహ సభ

కర్నూలు(సెంట్రల్): విజయవాడలోని జింఖానా మైదానంలో ఈనెల 24వ తేదీన కాంగ్రెస్ పార్టీ నిర్వహించే జై భారత్ సత్యాగ్రహ సభకు కర్నూలు జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్లాలని డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు గురువారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సభకు జాతీయ, రాష్ట్రీయ నేతలు హాజరవుతున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలు తరలి వెళ్లాలని కోరారు.



రంజాన్ నేపథ్యంలో కొత్తబస్టాండ్ దగ్గర ఉన్న ఈద్గాలో ఏర్పాట్లను కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ పరిశీలించారు. పండుగ రోజు ప్రార్థనలు చేసేందుకు వచ్చే ముస్లింలకు సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. – కర్నూలు(రాజ్‌విహార్)

### ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ ఉద్యోగులు తీసుకున్న పర్సనల్, హౌసింగ్, ఇతర లోన్లకు సంబంధించి ఈఎంఐలను జీతాలు పడిన రోజునే తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఏపీ జేఏసీ అమరావతి బ్యాంకులను కోరింది. ఉద్యోగులకు సమయానికి జీతాలు పడకపోవడంతో ఈఎంఐలపై అదనంగా జరిమానాలు విధిస్తుండడంతో ఇబ్బందిగా ఉందని ఏపీజేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు వి.గిరికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో వివిధ బ్యాంకుల మేనేజర్లకు కలసి ఉద్యోగుల లోన్ల చెల్లింపులపై చర్చించారు. తమ విన్నపాన్ని బ్యాంకులు పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఉద్యోగులను డిఫాల్టర్ల జాబితాలో చేర్చవద్దని కోరారు.

### నాబార్డు డీడీఎంకు సత్కారం



బదిలీపై వెళుతున్న నాబార్డు డీడీఎం పార్థవను సత్కరిస్తున్న డీసీసీబీ పాలకవర్గం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో సుదీర్ఘకాలం పనిచేసి బదిలీ అయిన నాబార్డు డీడీఎం పార్థవకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలకవర్గం సభ్యులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన హైదరాబాద్‌లోని నాబార్డు రీజనల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో భువనేశ్వర్‌లో ఏజీఎంగా పనిచేస్తున్న సుబ్బారెడ్డిని డీడీఎంగా నియమించారు. బదిలీ అయిన డీడీఎం పార్థవను గురువారం సాయంత్రం డీసీసీబీ చైర్‌పర్సన్ మహాలక్ష్మి ఆధ్వర్యంలో ఆమె చాంబరులో ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లాభాల బాట పట్టడంతో ఆయన పాత్ర ఎంతో ఉందని పేర్కొన్నారు. డీసీసీబీకి, జిల్లాకు ఆయన అందించిన సేవలను ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.రామాంజనేయులు కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజావిష్ణువర్ధన్ రెడ్డి, పాలకవర్గం సభ్యులు గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, సీమ సుధాకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, మూలింటి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యం సాధిస్తే విజయం మీదే



కర్నూలు హాకీ జట్టుకు షీల్డ్ బహుకరిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

కర్నూలు(టౌన్): క్రీడల్లో నిరంతరం సాధన చేస్తూ నైపుణ్యం సాధిస్తే విజయం మీదే అని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. గురువారం స్థానిక ఎస్టీబీసీ కళాశాల క్రీడామైదానంలో ప్రతాపరెడ్డి స్మారక హాకీ పోటీల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. విజేతలకు షీల్డ్‌లు బహుకరించి హాకీ క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించిన చిన్నారులకు హాకీ స్టిక్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీనియర్లు హాకీ క్రీడాంశంలో చిన్నారులను ప్రోత్సహించడం హర్షించదగ్గ విషయమన్నారు. తెలంగాణ మాస్టర్స్ హాకీ క్లబ్ అధ్యక్షుడు రఘునందన్ రెడ్డి మాట్లాడుతూ.. సంఘం ఆధ్వర్యంలో రైజింగ్ స్టార్ హాకీ క్లబ్‌కు 50 హాకీ స్టిక్‌లు అందజేస్తున్నట్లు చెప్పారు. ఎస్టీబీసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి స్టీఫెన్, హాకీ సంఘం కార్యదర్శి కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆదోని జట్టుపై 3-2 స్కోర్‌తో విజయం సాధించిన కర్నూలు హాకీ జట్టును ఎమ్మెల్యే అభినందించి షీల్డ్ బహుకరించారు.

# సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన



రాజీవ్‌గాంధీ నగర్‌లో లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం 26వ వార్డు 67వ సచివాలయం పరిధిలోని కృష్ణానగర్, న్యూ కృష్ణానగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో చేసిన మేలును ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేశామన్నారు. కరోనా ప్రభావంతో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగాలేకున్న ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని సంక్షేమ పథకాలను అందించామన్నారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తేడాను ప్రజలు గమనించాలన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో అవినీతి రహితంగా పాలన అందిస్తున్నామన్నారు. పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ చేస్తున్నామని వివరించారు. పథకాలకు అర్హుల ఎంపికలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హతను ప్రమాణికంగా తీసుకుని అమలు చేస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్న సీఎంను ఆశీర్వదించాలన్నారు. డిప్యూటీ మేయర్ సిద్దారేణుక, కార్పొరేటర్లు డీఎల్ కాంతారెడ్డి, శ్వేతారెడ్డి, శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, జయరాముడు, మహేశ్వర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

### సేవలో భాగస్వాములు కావాలి

కల్లూరు: సామాజిక సేవలో అందరూ భాగస్వాములు కావాలని (ఆలిండియా బ్యాంక్ ఎప్లాయిస్ అసోసియేషన్) ఏఐబీఈఏ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ నాగరాజు, ప్రసిడెంట్ రోజరమణి అన్నారు. గురువారం ఏఐబీఈఏ ఫౌండేషన్ దినోత్సవం సందర్భంగా కర్నూలు శాఖ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని ధర్మపేట ఎస్సీ కమ్యూటీ హాల్‌లో వధూవరులకు డ్రెస్ చేంజ్ గది నిర్మాణం కోసం రూ.38,500 విరాళంగా అందించారు. సభ్యులు శివ కృష్ణ, రాముడు, సతీష్ రెడ్డి, రాజ హరిణి, సుమన్ పాల్గొన్నారు.

### ఎస్‌డీపీఐ నగర అడహక్ కమిటీ ఎన్నిక

కర్నూలు(సెంట్రల్): సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా కర్నూలు నగర నూతన అడహక్ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షుడిగా అఫ్జాన్ హుస్సేన్, ఉపాధ్యక్షురాలిగా షేక్ ఫర్వా, ప్రధాన కార్యదర్శిగా జలీల్, కార్యదర్శిగా షేక్షావలి, కోశాధికారిగా చాంద్‌బాషా పాటు తోపాటు కమిటీ సభ్యులుగా షేక్ అబ్దుల్లా, అబ్దుల్ సలాం, రఫీక్ అహ్మద్ ఎన్నికయ్యారు.

# వంటింటి ప్రమాదాలపై అప్రమత్తం

కర్నూలు (టౌన్): వంటింట్లో జరిగే అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రాంతీయ అగ్నిమాపక శాఖ అధికారి ఎం.భూపాల్ రెడ్డి సూచించారు. గురువారం స్థానిక కర్నూలు ఫైర్ స్టేషన్ ప్రాంగణంలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాంగణంలో అగ్నిమాపక పరికరాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. మదర్ థెరిస్సా ఫార్మాసూటికల్ కళాశాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. గ్యాస్ లీకై వంటింట్లో ప్రమాదం జరిగినప్పుడు వెంటనే రెగ్యులేటర్ ఆఫ్ చేయాలన్నారు. ఆందోళనకు గురి కాకుండా మంటలు ఆర్పడంపై దృష్టి పెట్టాలని సూచించారు. కో-ఆపరేటివ్ ప్రాజెక్టు ఆఫీసర్ రామాంజనేయులు, జయసింహా, అవినాష్ పాల్గొన్నారు.







# పాతబస్తీలో ఈద్ సందడి...



రంజాన్ పండుగ సమీపిస్తుండడంతో కర్నూలు నగరంలోని పాతబస్తీ ప్రాంతమైన వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి పెద్ద మార్కెట్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపుల్లో ముస్లింలు దుస్తులు, చెప్పులు, గాజులు, మెహిందీలు, గిల్టు నగలు, తీపి పదార్థాలు చేసుకునేందుకు సేమియా, డ్రై ఫ్రూట్స్, కిస్‌మిస్, ఖర్జూరా తదితర వస్తు సామగ్రి కొనుగోళ్లతో సందడి నెలకొంది. పాతబస్తీలోని వీధులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు





### 1 నుంచి 'భక్త ప్రహ్లాద' స్కూల్

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో మే 1వ తేదీ నుంచి భక్త ప్రహ్లాద స్కూల్ నిర్వహించనున్నట్లు ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు తెలిపారు. వేసవి సెలవులు వృథా కాకుండా విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు ఉంటాయని, చిత్రలేఖనం, రంగులు అద్దడం, కథలు చెప్పడం, భగవద్గీత శ్లోకాలు, విలువల విద్య, మృదంగం కరతాళ విద్య, అన్నమాచార్య కీర్తనలు, నమస్కార శ్లోకాలు, కళల విద్య అంశాల్లో నామమాత్రపు రుసుంతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు 95053 77520, 9981 47723 నంబర్లను సంప్రదించాలన్నారు.

### బ్లడ్ క్యాన్సర్‌పై ఆందోళన వద్దు

కర్నూలు(హాస్పిటల్): బ్లడ్ క్యాన్సర్ బారిన పడిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం అత్యుత్తమ చికిత్స విధానం అందుబాటులోకి వచ్చిందని హైదరబాద్‌లోని యశోద హాస్పిటల్ హెమటో ఆంకాలజిస్ట్, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ గణేష్ జేషేత్వార్ చెప్పారు. క్యాన్సర్ నుంచి కోలుకున్న వారితో గురువారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన పాల్గొన్నారు. పలువురు క్యాన్సర్‌ను జయించి సాధారణ జీవితాన్ని గడుపుతున్నారన్నారు. ముందుగా గుర్తిస్తే క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేసుకునే అవకాశాలు ఉంటాయని వెల్లడించారు.